
# పుణ్యం పురుషార్థం

-శాంతా సూరపు

అసురసంధ్య వేళ.

మెర్క్యూరీలైట్ల మధ్య గుడి ప్రాంగణం ఆహ్లాదంగా ఉంది.

"గోవిందా... గోవిందా..."



భక్తులు ముక్త కంఠాలతో తిరుమలేశుని కృపకోసం అర్జీలు పెట్టుకుంటున్నారు.

క్యూ నెమ్మదిగా కదులుతోంది.

శ్రీ వెంకటేశ్వరుని దివ్య మంగళ స్వరూపం గాంచి భక్తులు సమ్మోహితులౌతున్నారు. ట్రాన్స్‌లో నడుస్తున్నారు.

చేతిలో ఉన్న మూడేళ్ళ బాబుతో చేతులు జోడింపజే సెకెనుకాలం దేవుని ఎదుట నిలుచుని ప్రక్కకుజరి వెనుకవాడికి అవకాశం ఇచ్చి వెనుతిరిగాడు కృషి భారం

క్యూలో ముందుకు జరుగుతున్న 'ఆమె' తననే చూస్తూండటం గమనించాడు. తను చూడటంతో తిరిగి దేవుని వైపు చూపు మార్చుకుంది.

చిన్నగా నవ్వుకుంటూ గర్భగుడిదాటి హుండీ దగ్గరకొచ్చి ఆగాడు కృషి, జేబులోంచి నోట్ల కట్టతీసి బాబు చేతుల మీదుగా హుండీలో వేయించాడు.

అక్కడ నుండి కదిలి క్యూ ఫాలో అయి ప్రసాదం అందుకుని ఆలయప్రాంగణంలో ఓ చోట బాబుతో కూర్చున్నాడు కృషి.

అతడి ఉనికిలో ప్రత్యేకత గమనించి అతడిని చూసిన వాళ్ళు ఎక్కడో చూసిన జ్ఞాపకంగా మరోసారి చూసి వెళ్ళిపోతున్నారు.

తెలుగువాడే అయినా తెలుగు చిత్రసీమ చిన్నచూపు చూడటంతో కన్నడంలో కనకవర్షం కురిపిస్తూన్న వర్ధమాన కథానాయకుడతడు.

అక్కడెవరూ అంతగా తనని గుర్తు పట్టరనే ధీమాతోనే అతడిలా ఒంటరిగా నలుగురిలోకి సాదాసీదాగా వచ్చింది.

దూరంగా ప్రసాదం అందుకుని వచ్చిన ఆమె ధ్వజ స్థంభం దగ్గర నిల్చుని తమ వైపే చూస్తుండటం గమనించాడు కృషి.

క్యూలో నిల్చున్న గంట క్రితం నుండి ఆమె వరస అదే. గుర్తు పట్టిందేమో పలకరించడానికి వస్తుందేమోనని ప్రసాదం తింటూ ఆమెనే గమనిస్తు న్నాడు కృషి.

ఇరవై అయిదు ఉంటుంది ఆమె వయసు. మనిషి మామూలు కంటే ఎక్కువ ఎత్తు. చుడీదార్ ధరించటంతో ఉన్న వయసుకంటే తక్కువ కనిపిస్తుంది. పచ్చని మేనివర్ణం... అలా చూస్తోంటే అతడికెందుకో మణిరత్నం రోజా జ్ఞాపకం వచ్చింది.

ఒడిలోని పిల్లాడు గొడవచేయడంతో దృష్టిని ఆమెపై నుండి మార్చాడు. ఒడిలోంచి లేవ ప్రయత్నిస్తోన్నవాడిని క్రిందికి దించాడు.

అటు ఇటూ పరుగులెత్తి ఆడుకుంటోన్న వాడికేసి కాసేపుచూసి మళ్ళీ ధ్వజస్థంభం వైపు చూశాడు. ఆమె అక్కడ లేదు. చుట్టూ చూశాడు. వెతకబోయిన తీగె కాలికి తగిలినట్లు ఎప్పుడొచ్చిందో మరి... బాబు చెయ్యందుకుని ఆడిపిస్తుందామె.

అతడు చూడటంతో పరి చయం కోసమన్నట్టు నవ్వింది. ప్రతిగా ఇతడు నవ్వడంతో మొహమాట పడి నట్టుగా ముఖం పెట్టింది. బాబుతో దొంగాట మొదలు పెట్టింది.

బాబుకూడా ఆడుకునే మూడ్‌లో ఉన్నాడేమో... ఆమె దగ్గర కొత్త ఫీలవ్వకుండా ఆమె నందుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. పిల్లాడి మూడ్ పాడుచెయ్యటం ఇష్టంలేక బాబుని ఆమెకే వదలి వేశా డతను. బాబుకి దొరక్కుండా అటూ ఇటూ తిరుగుతూ ఆమె మధ్య మధ్యలో అతడివైపు చూస్తోంది.

అరగంట తరువాత బాబు అలిసిపోవటంతో ఎత్తుకుని తీసుకెళ్ళి అతడికి అప్పజెప్పింది.

'బాబు పేరేంటి...?" కృషి చేతిలో బాబుని పెట్టాక అడిగిందామె

"బాబునే అడగండి." నవ్వాడు.

"పేరేంటమ్మా...?" బాబు బుగ్గలు నొక్కుతూ అడిగిందామె.

'విన్నూ భరత్." ముద్దుగా చెప్పాడు బాబు.

బాబు చెంపలు పట్టుకుని అతడి మీదుగా వంగి బాబు బుగ్గలు ముద్దుపెట్టుకుందామె.

ఆ చర్యలో ఒకరి శరీరం ఒకరికి తగలటం ఆమె ఫీలయ్యిందో లేదో తెలియదు కాని, అతడు మాత్రం ఫీలయ్యాడు క్షణకాలం.

ఆమె కావాలనే అలాచేసిందా అనే అనుమానం అనుమానంగానే మిగిలిపోయింది. కాని, ఓ విషయం అతడికి రూఢీ అయ్యింది. తనెవరో ఆమెకు తెలియదు.

గుడి సింహద్వారం దాటి బయటికొచ్చాక ఆమె ఎటు వెళ్ళిందో కనిపించలేదు. తనరాక కోసమే కాచుకున్న డ్రైవర్‌తో పాటు కారు ఉన్న వైపు నడిచాడతడు.

కారులో కూర్చున్నాక కాటేజీవైపు వెళ్తూ ఆమెను గూర్చి ఆలోచించాడు.

తనని గుర్తించి పట్టి పట్టి చూస్తోందని రోటీన్‌గా ఫీలైన అతడికి కారణం అదికాదని తెలిశాక ఆ అనుభవం క్రొత్తగా అనిపించింది.

కాటేజీకి చేరుకున్నాక కారు పార్కింగ్‌లో పెట్టి భోజనం చేసి రమ్మని డ్రైవర్ చేతిలో డబ్బుపెట్టి రూంవైపు నడిచాడు.

తమని అనుసరించి జీప్ దిగిన 'ఆమె'ను గుర్తించలేదతడు.

కాసేపు రిలాక్సై రూం నుంచి బయటపడి బాబుతో రెస్టారెంట్‌వైపు నడిచాడు. కార్నర్‌లో ఖాళీ టేబుల్ కోసం చూశాడు. బాబు అతడిని తట్టి మరోవైపు చూపించాడు. పిల్లాడి జ్ఞాపకశక్తికి అప్రతిభుడవ్వకుండా ఉండలేక పోయాడు కృషి.

ఆ మరో కార్నర్‌లో 'ఆమె' కూర్చుని ఉంది. ఈ సారి శారీలో

పలకరింపుగా నవ్వింది. అతడు రెస్పాన్స్ఇచ్చి మరోవైపు సీటుకోసం చూడబోతే బాబు అటు వెళ్దాం అంటూ సైగ చేసి చూపించాడు.

'అది చూసి ఆమె లేచి వచ్చి 'ఇఫ్ యూ డోంట్ మైండ్..." చనువుగా బాబుని కృషి చేతుల్లోంచి తీసుకుని ముందుకు నడిచింది. అతడికిక ఆమెను ఫాలో కాక తప్పలేదు.

టేబుల్ దగ్గరకెళ్ళాక బాబుని ఆమె ప్రక్కనేకూర్చోపెట్టుకుంది.


భోజనం చేస్తూ ప్రేక్షకుడే అయ్యాడు.

అప్పుడు చూసిన వాళ్ళెవరైనా బాబుతో ఆమె అనుబంధాన్ని చూసి ఆ ఇద్దరినీ తల్లీ కొడుకులనే అనుకుంటారు.

భోజనం చేశాక ఆమె అభ్యర్థన మీదట తిరిగి గుడివైపు నైట్‌వాక్ కెళ్ళారు. బాబుని ఓ చేత్తో పట్టుకుని అతడి ప్రక్క చాలా దగ్గరగా నడుస్తోన్న ఆమె శరీరం ఉండుండీ కంపిస్తోంది.

"బాబు వాళ్ళ మమ్మీ..." మాట కలిపిందామె.

"లేరు..." పూర్తిగా చెప్పటానికి ఇష్టం లేనట్టు ముక్తసరిగా జవాబిచ్చాడు.




కొలనుపాక బాలరాజు ,కేరాఫ్: వెంకటేశ్, గుండ్లగూడెం, ఆలేరు(మండలం) , నల్గొండ - 508 101

అతడు చూడలేదుకాని, ఆమె ముఖంలో కొంత ప్రసన్నత చోటు చేసుకుంది.

ఆమె ఆ క్షణమే ఓ నిర్ణయం తీసుకుంది.

అతడికి మరింత చేరువగా నడవసాగింది. అభిమానుల అడ్మిరేషన్ అనుభవమున్న అతడికి ఆమె ప్రవర్తన అసహజంగా తోచలేదు.

'మీ పేరు...?' కాజువల్‌గా అడిగాడు.

'యాస్మినా...'' చెప్పిందామె.

ఆమె వైపు ఆశ్చర్యంగా చూశాడు.

నుదుట కుంకుమ బొట్టు. నేతచీర కట్టు అంతా పదహారణాల తెలుగు ఆడపడుచులా ఉన్న ఆమె చెప్తేకాని ముస్లిం అని పోల్చుకోవడం కష్టం.

'అదేంటి మీరిక్కడ...?' ఆ ఆశ్చర్యంతోనే అడిగాడు.

'మీరు మా మసీదులూ, సమాధులూ సందర్శించ వస్తున్నప్పుడు మేం మీ గుళ్ళూ గోపురాలు సందర్శించ రావటంలో ఆశ్యర్యం ఏముంది...?''

''కానీ...''

''నా దైవదర్శనం విషయమా... మనల్ని నడిపించే అదృశ్యశక్తి ఏదో ఉందని తలపించే ఆ ఇన్విరాన్‌మెంట్ భక్తి భావాన్నీ, మానసిక శాంతినీ ఇస్తున్నప్పుడు స్పందించే మనస్సునెందుకు ఒకే మతం, ఒకే దేవుడూ అంటూ ఆంక్షలు పెట్టటం...''

ఆమెలోని ఏకతా భావానికి అతడు శిరస్సువంచాడు. ఆమెకు ప్రతిగా ఎక్కడైనా అవకాశం దొరికితే ఎప్పుడైనా మసీదుకెళ్ళినమాజు చెయ్యాలనుకున్నాడు.

ఆ విష యమై అతడు మరేం మాట్లాడలేదు కాని అతడికి ఒకటి అర్థమయ్యింది, ఆమెలోని వ్యక్తి.

ఆమె అతడు 'ఏమిటి' అనేది తెలుసు కోవాలనుకుంది. కానీ, తనని గుర్చి ఇంకొంచెం చెప్పాల్సివస్తుందని ఆ ప్రయత్నం మానుకుంది. అతడి కూడా తన ఉనికి బయటపెట్టటం ఇష్టంలేక ఆమెను గూర్చి మరేం అడగలేదు.

గుడి దగ్గరకెళ్ళాక గుడి ఎదుట దుకాణాల్లో అతడు వద్దంటున్నా బాబుకోసం ఆమె చాలా బొమ్మలు కొని పెట్టింది. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో కృషి ఆమె కోసం జరీచీరె, గాజులు కొన్నాడు. ఆమెకు తీసుకోక తప్పలేదు. కాటేజికి తిరిగొచ్చి చూసుకుంటే ఇద్దరివీ ప్రక్క ప్రక్క గదులే.

తిరిగొస్తున్నప్పుడు బాబు ఆమె చేతిలోనే నిద్ర పోయాడు. ఆమె చేతిలోంచి బాబుని తీసుకోబోతున్న కృషిని వారిస్తూ అందామె.

'ఈ రాత్రికి నా దగ్గరే పడుకోనీయండి.''

అతడు ఇబ్బందిగా చూశాడు.

''ప్లీజ్'' అభ్యర్థనగా చూసిందామె.

అతడు మొహమాటంలో పడ్డాడు. కానీ, బాబుని ఇంకొకరికి వదలటం అతడికి ఇష్టం లేదు.

''ఒక పనిచెయ్యండి.''


అతడివైపు ఆశగా చూసిందామె.

''మీరూ మాతోనే పడుకోండి...'' చెప్పాడు.

అలా అనటంలో అతడి భావమేదో అర్థమైనట్టు ఆమె హృదయం స్పందించింది. అతడు చెప్పినట్టు చెయ్యటానికి వెనుకాడలేదు.

తలుపు లోపలి నుండి లాక్ చేసి ఆమె వద్దంటోన్నా బాబునూ, ఆమెనూ బెడ్‌పై పడుకోనిచ్చి సోఫాలో సర్దుకున్నాడు అతడు.

రాత్రంతా ఆమెకు ఏదో ఆలోచనతో నిద్రపట్టలేదు.




''ఇవాళ నేను హోంవర్క్ చేయలేదు. టీచర్ పనిష్మెంటిస్తుందేమోనని భయంగా ఉంది పద్మా.''

''మరేం భయపడకు. ఈరోజు మన టీచర్ దగ్గర కళ్ళద్దాలు లేవు. నిన్ననే రిపేరుకిస్తుంటే నేను చూశా.''

-కె.శ్రీనివాస్(మల్లారం)
మం:మలహర్-505 184
కరీంనగర్ - జిల్లా.

చిన్న చప్పుడైనా మేలుకుంటోంది. అతడు మాత్రం ఏ భావమూ లేకుండా పడుకున్నాడు.

చుట్టు ప్రక్కల క్షేత్రాలు దర్శిస్తూ తరువాత మూడు రోజులూ ఆమె వాళ్ళతోనే గడిపింది.

పాపనాశనంలో బాబుకి తలస్నానం చేయించింది. కాళహస్తి గుడిచుట్టూ ప్రదక్షిణలు చేయించి కంచిలో వెండిబల్లినీ, బంగారుబల్లినీ తాకించింది.

అదంతా చూసి ముచ్చటపడ్డ కృషి కంచిలో ఆమెతో అన్నాడు. 'పరాయి మతస్తులైన మీరు మా సాంప్రదాయాన్ని తూ.చ. తప్పకుండా పాటించటం ఓహ్... ఇట్స్ రియల్లీ వండర్‌ఫుల్... మనుషుల్లోంచి మతం మాసిపోయి మమత రాజ్యమేలేరోజు దగ్గర్లోనేవస్తే ఎంత బావుణ్ణు!''

ఆమె నవ్వింది.

'ఎందుకు నవ్వుతున్నారు?'' అడిగాడు.

''మీకు చెప్పినట్టు నాపేరు యాస్మినా కాదు.''

''మరి?'' భృకుటి ముడిచాడు కృషి.

'కాశ్మీర' చెప్పిందామె.

'ముందు ఎందుకలా చెప్పారు?'

''అంతా ఒక్కటే అనుకుని కలిసిపోయే ఆ భావం మనిషిని ఎంత థ్రిల్ చేస్తుందో మిమ్మల్ని చూసి తెలుసుకుందామనుకున్నాను.'''

''ప్రయోగమా...?''

''కాదు ప్రయత్నం... రిహార్సల్...''

''ఒక్కటవ్వటానికి ఎవరిలో వారు ఇలా ఇనిషియల్ రిహార్సిల్ వేసుకోవటం... ఈ పద్ధతేదో బావున్నట్టుందే'' మెచ్చుకోలుగా అన్నాడు.

ఆమె నవ్వి ఊరుకుంది.

తిరుగు ప్రయాణంలో ముందుగా బాబుని ఊటీలో




బి.సుధీర్.బి-39/15, ల్యాబ్ క్వార్టర్స్, కంచన్‌బాగ్, హైదరాబాద్ - 500 258.

దింపే ప్రోగ్రాం పెట్టుకున్నాడు. వాళ్ళతోపాటు ఆమెకూడా బయలుదేరింది.

ఈ మూడురోజులూ ఆమె బాబును ఒక్కనిమిషం కూడా విడవకుండా ఉండటం గమనించి కాదనలేక పోయాడు.

ఎందుకో ఆమె ఇంకా ఏదో కోరుకుంటోందవి చూచాయగా అర్థం అవుతోంది.

ఊటీ కాన్వెంట్‌లో బాబుని విడిచి పెడుతోన్నప్పుడు ఆ కొద్దిరోజుల అనుబంధానికే ఆమె చాలా ఎమోషనల్‌గా ఫీలవ్వడం అతడికి చిత్రంగా అనిపించింది.

బాబు కూడా అతడి కంటే ఆమెను విడిచిపెట్టటానికే ఎక్కువ గొడవ చేశాడు. బాబుని విడిచి తిరిగి కారెక్కాక ఆమె మరింత ముభావంగా ఉండిపోవటం చూసి "మీకు పిల్లలంటే అంత ఇష్టమా...?" పలకరించాడు.

ఆమె అతడివైపు చూసి ఊరుకుంది.

"తొందరగా పెళ్ళి చేసుకోండి..." ఆమెను రిలాక్స్ చెయ్యటానికన్నట్టు నవ్వాడు.

ఆమె మాట్లాడలేదు.

"మీరెక్కడికెళ్ళాలి." మాటమార్చాడు.

"మీరు...?" ఆమె మాట్లాడింది.

"బెంగుళూరు..."

"ఈ ఒక్కరోజు ఇక్కడ ఉండండి."

"ఏం...?"

"ఈ చోటు బావుంది..."

అతడదంతా చూడలేదు. కాని, మాట్లాడలేదు. బాబులేని వెలితి అతడు కూడా ఫీలవుతున్నాడేమో. బాబుని అంత దగ్గరగా చేరదీసిన ఆమె కంపెనీ ఆరోజుకి అతడికీ అవసరం అనిపించింది.

డ్రైవర్‌కి చెప్పి గెస్ట్‌హౌస్ వైపు పోనీమన్నాడు.

అప్పటికి చీకటిపడి దారిపొడుగునా లైట్లు వెలుగుతున్నాయి.

గెస్ట్‌హౌస్‌లో అడుగుపెట్టాక ఆమె ధోరణి పూర్తిగా మారిపోయింది.

తలారా స్నానం చేసి తడి ఒంటితోనే గుండెల చుట్టూ ఉన్న టవల్‌తో అతడి ముందు ప్రత్యక్షమయ్యింది.

ఎక్కడికక్కడ పొందికగా అమరిఉన్న ఆమె శిల్పాన్ని సంస్కారం మరచి తానూ కన్నార్పకుండా చూస్తూండి పోయాడు.

చీకటి చిక్కబడి చుక్కపొడిచి వేకువ మెళకువ తెచ్చుకున్నంత వరకూ ఇద్దరి మధ్య దేహమే మాట్లాడింది. అతడు గాఢనిద్రలోకి వెళ్ళిపోవటం చూసి ఆమె మెల్లగా లేచి ఫ్రెష్ అయ్యి బట్టలు సర్దుకుంది.

గెస్ట్ హౌస్ లోంచి బయటకొచ్చి టాక్సీ మాట్లాడుకుని కొండదిగువ దగ్గరల్లో ఉన్న రైల్వేస్టేషన్ వైపు బయలుదేరింది.

టాక్సీలో వెళ్తూ జరిగిందంతా గుర్తు తెచ్చుకుంది.

తనకి పెళ్ళవటం, బాబు పుట్టటం, బాబు పుట్టిన ఏడాదికి తను ఐ.ఎ.ఎస్ పాసవ్వటం, బాబుని భర్త దగ్గర వదలి తను ట్రయినింగ్‌కి వెళ్లటం, ట్రైనింగ్‌లో ఉన్నప్పుడే భర్త యాక్సిడెంట్‌లో పోవటం, ఆ యాక్సిడెంట్ లో బయటపడ్డ బాబుని ఎవరో రక్షించి తన వాళ్ళకి తెలియపరచటం, బాబు తన భవిష్యత్తుకు అడ్డం అవుతాడని తన వాళ్ళు బాబుని అతడి దగ్గరే వదిలెయ్యటం, భర్తతో పాటే బాబుకూడా పోయాడని నమ్మిన తనకి కొన్నాళ్ళకు తన వాళ్ళ కుట్ర తెలియటం, బాబు ఎక్కడుంది తెలియకపోవటం, దగ్గర్లో ఓ ఏజెన్సీప్రాంతం ప్రాజెక్టు ఆఫీసరుగా చేస్తూ విశ్రాంతి కోసం వారం రోజులు సెలవు పెట్టి సాదాసీదాగా తిరుపతి రావటం, అనుకోకుండా క్యూలో బాబుని చూసి పోలికలు గుర్తుపట్టి వెంట వెంట వెళ్ళటం, గుడిలో బాబుతో ఆడుతున్నప్పుడు బాబు కుడికాలి చిటికెనవేలి దగ్గరలో గురివింజ గింజంత పుట్టుమచ్చ తన బాబుని తనకి చూపటం, తన బాబుని తను దక్కించుకోవాలనుకుని బాబుకూడా ఉన్న అతడి వెంట తిరగటం, ఆ రాత్రి పడుకున్న బాబును తను తీసుకెళ్ళబోతే బాబని ఇంకొకరికి వదలటం ఇష్టంలేని అతడు తనని అతడి గదిలోనే పడుకోమనటంతో బాబు విషయంలో అతడు తీసుకుంటూన్న శ్రద్ధకు తన మనసు ఉప్పొంగటం, గత రాత్రి గెస్ట్‌హౌస్ దగ్గర బాబుని కూడా ఉంచుకున్న అతడు కన్నడహీరో కృషిభారత్ అని తెలియటం, అతడికి పెళ్ళి కాకపోవటం, అతడు బాబు చుట్టూ ఏర్పరచిన ఖరీదైన వాతావరణం, ముఖ్యంగా బాబుతో కృషి ఏర్పరచుకున్న అనుబంధం.

ఈ విషయం తనని అతడి నుండి బాబుని తీసుకునే విషయమై ఈ నాలుగురోజులూ ఆలోచింప జేసింది.

బాబుని కృషి నుండి పొందే ఆలోచనకు స్వస్తి చెప్పి తన బాబుపై అతడు ఏర్పరచుకున్న అనుబంధానికి కృతజ్ఞతగా అతడి ప్రతిమని తను మోసీ, కనీ, పెంచీ పెద్దచేసి బాబు దూరమైన లోటు తీర్చుకోవాలనుకుంది.

తన నిర్ణయాన్ని కార్యాచరణలోపెట్టి తనేమయిందని కృషి ఆలోచించుకునేలోపే ఈ చోటు దాటిపోయింది కాశ్మీర.

మూడునెలల తరువాత ఉద్యోగానికి రెండేళ్ళు సెలవు పెట్టింది కాశ్మీర.

పుట్టబోయే బిడ్డవిషయంలో సమాజానికి సమాధానం దొరక్కుండా ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోవాలనుకుంది.

ఆమెకు ఊటీ జ్ఞాపకం వచ్చింది.


తొమ్మిది నెలల తరువాత డెలివరీకి హాస్పిటల్‌లో జాయిన్ కాబోతూ ఎప్పటిలా బాబుని చూసేందుకు కాన్వెంట్‌కిబయలుదేరబోతోన్న కాశ్మీర అద్దె ఇంటిగుమ్మం దగ్గర ఎదురయ్యాడు కృషి.

ఎందుకో కాశ్మీర కళ్ళల్లో నీళ్ళొచ్చాయి.

అతడు కదలిపోయాడు. ఆర్తిగా ఆమెను అక్కున చేర్చుకున్నాడు.

అలసిపోయినట్లుగా ఆమె అతడి కౌగిట్లో ఒదిగి పోయింది!

శాంతా సూరపు
21-2, నేతాజీ వీధి,
నరసన్నపేట - 532 421.
శ్రీకాకుళం జిల్లా.




నానక్‌సింగ్, ఇ.నెం.9-4-66, బురుడ్‌గల్లి, నిజామాబాద్.